2 నుంచి కుసుమహరుల నామ వారోత్సవాలు

నల్లకుంట: ప్రశాంత్‌నగర్‌లో గల శ్రీ కుసుమ హరనాథ ఆశ్రమంలో ప్రథమ శ్రీ కుసుమహరుల నామ–వారోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆశ్రమ కమిటీ ప్రతినిధులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 2 నుంచి 9 వరకు ఉత్సవాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కుసుమహరుల కృపకు పాత్రులు కావాలని కమిటీ సభ్యులు కోరారు.

భక్తి శ్రద్ధలతో శని త్రయోదశి పూజలు



శనీశ్వరుడికి తైలాభిషేకం చేసి హారతి ఇస్తున్న అర్చకుడు స్వామి

నల్లకుంట: శని త్రయోదశిని పురస్కరించుకుని న్యూ నల్లకుంటలోని శ్రీ సీతారామాంజనేయ సరస్వతి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. ఆవరణలోని నవగ్రహ ఆలయంలో ఉదయం అర్చకుడు సీతారామ శర్మ మంత్రోచ్చారణల మధ్య శనీశ్వరుడుడికి తైలాభిషేకం చేశారు. అనంతరం భక్తులతో తైలాభిషేకాలు, అర్చనలు కావించి హారతులు ఇచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నవగ్రహ ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

ఉన్నత ఆశయాలతో ముందుకు సాగాలి



ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఎంపీ వంశీకృష్ణ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: విద్యార్థులు ఉన్నత ఆశయాలతో ముందుకు సాగాలని అప్పుడే వారి భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని అంబేడ్కర్ కళాశాలలో పీజీ విద్యార్థుల ఫ్రెషర్స్‌డే వేడుకలు శనివారం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో పాటు పట్టుదల, నమ్మకం, ఆత్మవిశ్వాసం దృఢంగా ఉన్నప్పుడే మంచి ఫలితాలు సాధిస్తారన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ విష్ణుప్రియ, ప్రిన్సిపాల్ డాక్టర్ మట్టా శేఖర్, వైస్ ప్రిన్సిపాల్ కుమారస్వామి, డాక్టర్ శ్రీధర్, వేమనరెడ్డి, అశోక్‌గౌడ్, డాక్టర్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలి



మాట్లాడుతున్న దాసు సురేశ్

చిక్కడపల్లి: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ అన్నారు. చిక్కడపల్లిలోని బాపునగర్ బస్తీలో సమితి సభ్యులతో కలిసి శనివారం రాత్రి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించామన్నారు. వీధి దీపాల ఏర్పాటుతో పాటు వృద్ధాప్య పింఛన్లు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో నేతలు పద్మావతి, లక్ష్మి, జ్యోతి, రాధిక, దుర్గేష్,హేమ, శారద, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక ముద్రణ నూతన యంత్రాలు ప్రారంభం

ఖైరతాబాద్: మింట్ కంపౌండ్‌లోని తెలంగాణ పాఠ్య పుస్తక ముద్రణాలయంలో నూతన పాఠ్యపుస్తక ముద్రణ యంత్రాలను పాఠ్యపుస్తక ముద్రణాలయం డైరెక్టర్ రమణ కుమార్ శనివారం ప్రారంభించారు. డీఎస్సీ కమిషనర్ ఈవీ నర్సింహ్మారెడ్డి నూతన యంత్రాలను అందజేసినట్లు తెలిపారు. యంత్రాలు మంజూరు కావడంపై కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.

ఓయూలో 180 ఇంకుడు గుంతల నిర్మాణం


ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో 180 ఇంకుడు గుంతలను నిర్మిస్తున్నా రు. స్వచ్ఛంద సంస్థ ఆర్థిక సహకారంతో రూ.30 లక్షల వ్యయంతో యూనివర్సిటీ క్యాంపస్‌లో ఆధునికంగా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయనున్నట్లు సెంటర్ ఫర్ బయోడైవర్సిటీ అండ్ కంజర్వేషన్ స్టడీస్ డైరెక్టర్ ప్రొ.శ్రీనివాసులు తెలిపారు. వేసవిలో భూగర్భ జలాలు ఎండిపోకుండా వర్షపు నీరు నిల్వచేసేందుకు ఇంకుడు గుంతలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. క్యాంపస్‌లోని మెయిన్ చెరువును సైతం మరమ్మతు చేయించనున్నట్లు చెప్పారు.



త్యాగరాయగాన సభ వెనుక రోడ్డు చౌరస్తా టీ కొట్టు వద్ద గుంతలుగా ఉన్న రోడ్డు



గానసభ రోడ్డులో కుంగిపోయిన మ్యాన్‌హోల్



వివేక్‌నగర్ రోడ్డులో ప్రమాదకరంగా గుంత

అటు గుంతలు.. ఇటు కంకర తేలి..

- గాంధీనగర్ డివిజన్‌లో అధ్వానంగా అంతర్గత రోడ్లు
- రాకపోకలకు వాహనదారుల తీవ్ర ఇబ్బందులు
- పట్టని ప్రజాప్రతినిధులు, అధికారులు

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. ఓవైపు గుంతలు పడి, మరోవైపు కంకార తేలి వాహనాదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. ప్రధానంగా చిక్కడపల్లి, సాయిఅపార్ట్‌మెంట్, రాంషా ఆయుర్వేదిక్‌షాప్ లేన్, వివేక్‌నగర్, నగర కేంద్ర గ్రంథాలయం, సుధాహోటల్ లేన్, అశోక్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, జవహర్‌నగర్ రోడ్లు గుంతలు పడడమే కాకుండా మ్యాన్‌హోల్స్ కుంగిపోయాయి. దీంతో తరచూ పలువురు వాహనాదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. వివేక్‌నగర్ పీపుల్స్ పార్క్ శ్రీ రేము ఎల్లమ్మ నాగదేవత గుడి రోడ్డులో 15 ఏళ్లుగా సీసీ రోడ్డు వేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకుని యుద్ధప్రతిపాదికన పనులు చేపట్టాలని వాహనాదారులు, స్థానికులు కోరుతున్నారు.



బ్యాంక్ ఆఫ్ బరోడా నుంచి ఆంజనేయస్వామి టెంపుల్ వెళ్లే రోడ్డుపై నిలిచిన నీళ్లు

పట్టించుకునే వారే లేరు..



రోడ్లన్ని గుంతలు మారి ప్రమాదకరంగా ఉన్నాయి. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ప్రధానంగా చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయం, త్యాగరాయగాన సభ, వివేక్‌నగర్, యూనియన్ బ్యాంక్, పీపుల్స్ పార్క్ తదితర ప్రాంతాల్లో గుంతలు పడి.. కంకర తేలిన రోడ్లకు త్వరగా మరమ్మతులు చేపట్టాలి. అలాగే అవసరమైన చోట కొత్త రోడ్లు వేయాలి.

– జాటోత్ రాజు
పోటీపరీక్షల అభ్యర్థి చిక్కడపల్లి

ప్రమాదాల బారిన వాహనదారులు..



వివేక్‌నగర్, లేబర్ కార్యాలయం, గాంధీనగర్, అశోక్‌నగర్, జవహర్‌నగర్‌లోని రోడ్లన్ని గుంతలు పడి అధ్వానంగా మారాయి. దీంతో వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. మరోవైపు ఏపుగా పెరిగిన చెట్ల వల్ల పలుచోట్ల వీధిలైట్ల వెలుగు కూడా కనిపించడం లేదు. దీనికితోడు రోడ్లు గుంతలు పడి ఉన్నాయి. అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– బి.శాలినీ, టైలర్ వివేక్‌నగర్

సమస్యల పరిష్కారానికి కృషి..



గాంధీనగర్ డివిజన్‌లో రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని పలువురు స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చారు. త్వరలోనే అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలిస్తాం. చిక్కడపల్లి, వివేక్‌నగర్, జవహర్‌నగర్, అశోక్‌నగర్, త్యాగరాయగానసభ, శ్రీ నల్లపోచమ్మగుడి నుంచి యూనియన్ బ్యాంక్ వెళ్లే దారి రోడ్డునే కాకుండా మిగితా అవసరమున్న చోట్ల కూడా మరమ్మతులు చేపట్టడమే కాకుండా కొత్తగా రోడ్లు వేయిస్తా. అంతేగాకుండా వీధిదీపాలు అన్ని ప్రాంతాల్లో వెలిగేలా చర్యలు తీసుకుంటాను.

– ఎ.పావనీవినయ్‌కుమార్,
గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్

ఆరాంఘర్ ఫ్లైఓవర్‌కు శివశంకర్ పేరు పెట్టాలి

కవాడిగూడ: పాతబస్తీలోని ఆరాంఘర్ నుంచి జూపార్కు వరకు ఇటీవల ప్రారంభించిన ఫ్లైఓవర్‌కు మాజీ కేంద్ర మంత్రి, మాజీ గవర్నర్‌గా దేశానికి సేవలు అందించిన పుంజాల శివశంకర్ పేరు పెట్టాలని పీవీకే టీం సభ్యులు డిమాండ్ చేశారు. ఇందిరాపార్కు వద్ద ఆర్ విజయేందర్, కే రవికుమార్, ఏ. మహేశ్, సీహెచ్ సంతోష్ శనివారం మాట్లాడారు. ఫ్లైఓవర్‌కు దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ పేరు పెడుతామని సీఎం ప్రకటించారని, మరోవైపు హైదరాబాద్ మాజీ ఎంపీ దివంగత ఎంఐఎం వ్యవస్థాపకుడు సల్లాద్దీన్ ఓవైసీ పేరు పెట్టాలని ఎంఐఎం నేతలు డిమాండ్ చేస్తున్నారన్నారు. వీరి పేర్లు కాకుండా ఉస్మేనీ హాలంలో జన్మించి ఇదే ప్రాంతంలో విద్యనభ్యసించి సాధారణ అడ్వకేట్‌గా జీవితం ప్రారంభించి కేంద్ర న్యాయశాఖ మంత్రిగా , రెండు రాష్ట్రాలకు గవర్నర్‌గా సేవలు అందించిన పుంజాల శివశంకర్‌పేరును నామకరణం చేయాలని వారు కోరారు. శివకుమార్, టి. అభిషేక్‌చారి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇందిరాపార్కు వద్ద మాట్లాడుతున్న పీవీకే టీం సభ్యులు

బీసీ కమిషన్ వెంటనే ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలి

లిబర్టీ: బీసీ కమిషన్ వెంటనే రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి కోరారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించాలంటే బీసీ కమిషన్ నివేదికనే కీలకంగా కానున్నదని ఆయన పేర్కొన్నారు. శనివారం దళ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీల పట్ల చిత్తశుద్ధితోనే వ్యవహరిస్తూనే రాష్ట్ర శాసన సభలో శాసన మండలిలో పంచాయతీరాజ్ సవరణ బిల్లును తీసుకు వచ్చిందని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కులగణన చేసిన నేపథ్యంలో బీసీ కమిషన్ ఇంకా నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందించలేదని ఆయన తెలిపారు. నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇప్పటికైనా బీసీ కమిషన్ కాలయాపన చేయకుండా వెంటనే నివేదిక సమర్పిస్తే ప్రభుత్వం తదుపరి చర్యలకు ఉపక్రమిస్తుందని అన్నారు.

బీఆర్ఎస్ బూత్ స్థాయి కమిటీ సమావేశం



మాట్లాడుతున్న అధ్యక్షుడు రాకేశ్‌కుమార్

చిక్కడపల్లి: గాంధీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గాంధీనగర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ముడారపు రాకేశ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆ డివిజన్ బూత్ స్థాయి కమిటీల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి పోతుల శ్రీకాంత్, గాంధీనగర్ డివిజన్ పరిశీలకులు కొండపల్లి మాధవ్, ముఠా నరేశ్, ఆకుల శ్రీనివాస్, పున్న సత్యనారాయణ, పాశంరవి, పి.సుధాకర్, బోనం బన్నీ, ముఠా శివ సంపత్, షేక్ జహంగీర్, ఎం.దేవయ్య, ఈ.విఠల్, పి.రాజ్‌కుమార్, హెచ్.హనుమంతు, టి.యాదగిరి, వంశీ, ఎస్టీ ప్రేమ్‌కుమార్, సంతోష్, రవిశంకర్ గుప్తా, ఎం.ఆనందకుమార్, ప్రభుష, జి.రాము, బి.కిరణ్‌కుమార్, ఐ.కుమార్‌స్వామి, ఆర్.శ్రీనివాస్‌ఏ, ఖ్యాత శ్రీనివాస్, పుట్టా నవీన్ యాదవ్, మలయాళ్‌ఘోవర్ధన్, తలారి యాదగిరి, రామ్మూర్తి, చందు, అభినవ్, జ.క్రాంతి, టి.దయానంద్, పాండు పాండు నాయక్, అరుణ శ్రీ స్వరూప, సుధ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు



అంబేడ్కర్ కళాశాలలో భోగి మంటలు వేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా సంస్థల ప్రాంగణంలో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంప్రదాయమైన దుస్తులు ధరించి, రంగురంగుల ముగ్గులు వేసి, గొబ్బెమ్మలను పెట్టి కొత్త శోభను తీసుకువచ్చారు. భోగి మంటలు, నృత్యాలతో అలరించారు. ముఖ్య అతిథిగా కళాశాల డైరెక్టర్ విష్ణుప్రియ హాజరై మాట్లాడుతూ.. మన సంస్కృతిని విద్యార్థులకు తెలియజేసేందుకే ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కల్చరల్ కోఆర్డినేటర్ సుంకరి నవీన్, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.



ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

సందడే.. సందడి

- ముషీరాబాద్‌కు సంక్రాంతి శోభ
- జోరుగా పతంగుల అమ్మకాలు
- పిండివంటలకూ భలే గిరాకీ
- మరోవైపు భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి బ్రహ్మోత్సవాలకు సిద్ధం





ముషీరాబాద్‌లోని ఏక్‌మినార్‌లో పతంగులు కొనుగోలు చేస్తున్న చిన్నారులు

ముషీరాబాద్: సంక్రాంతి పండుగ అనగానే ఠక్కున గుర్తుకువచ్చేది పతంగులు, పిండివంటలు. మరోవైపు ప్రసిద్ధిగాంచిన భోలక్‌పూర్ బాకారంలోని భ్రమరాంభ మల్లిఖార్జున స్వామి (మల్లన్న) ఆలయ బ్రహ్మోత్సవాలు. యేటా లాగే ఈసారి కూడా రెండు రోజుల ముందునుంచే ముషీరాబాద్‌లో పండుగ వాతావరణం నెలకొంది. పతంగుల విక్రయాలకు ప్రసిద్ధిగాంచిన ఏక్‌మినార్‌లో ఉదయం 8 నుంచి రాత్రి 11 గంటల వరకు చిన్నారులు, పెద్దలు గాలిపటాలు కొనుగోలు చేస్తున్నారు. ఈసారి వెరైటీగా బట్టతో పాటు ప్లాస్టిక్, పేపర్‌తో కవర్ చేసిన పతంగులకు డిమాండ్ అధికంగా ఉంది. కైట్ల సైజ్‌ను బట్టి రూ.10 నుంచి మొదలు రూ.250 వరకు వ్యాపారులు విక్రయిస్తున్నారు. వీటితో పాటు దారం, చెరకులను సైతం కొనుగోలు చేస్తున్నారు.

జోరుగా పిండి వంటకాల అమ్మకాలు..

పిండివంటల కొనుగోళ్లతో ముషీరాబాద్‌లోని స్వగృహ స్వీట్ షాపులు కిటకిటలాడుతున్నాయి. సకినాలు కిలో రూ.360 నుంచి మొదులు రూ.400 వరకు విక్రయిస్తున్నారు. నువ్వుల లడ్డూ సైతం రూ.400కిలో చొప్పున విక్రయిస్తున్నారు.

మల్లన్న బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం..

భోలక్‌పూర్ డివిజన్‌లోని బాకారంలో గల ప్రసిద్ధిగాంచిన భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. టెంపుల్‌కు రంగులు వేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈనెల 13 నుంచి 16 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు.



వైభవంగా నిర్వహిస్తాం..



యేటాలాగే ఈసారి కూడా భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తాం. ఈ నెల 16 వరకు ఆలయంలో ప్రతిరోజూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తాం. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఆలయాన్ని సర్వంగా సుందరంగా ముస్తాబు చేశాం.

– నల్లవెల్లి అంజిరెడ్డి, ఆలయ మేనేజింగ్ ట్రస్టీ

భక్తి శ్రద్ధలతో కూడారై ఉత్సవం



సీతారామచంద్రులు, గోదాదేవికి పూజలు



కూరాడై మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నల్లకుంట: న్యూ నల్లకుంటలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. వేద పండితుడు నాగేంద్ర శర్మ మంత్రోచ్చరణాల మధ్య కూరాడై మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా సీతారాములు, రాధాకృష్ణులకు, గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా తిరుప్పావై, తిరుపళ్లుచ్చి అను ద్రవిడ ప్రబంధాలను నివేదన సమయంలో అనుసంధానం చేశారు. కృష్ణ మందిరం వద్ద మహిళలు పాటలు పాడారు. అలాగే న్యూ రామాలయంలో గోదాదేవి అమ్మవారికి పాయసాన్నం (పరమాన్నం) నివేద చేశారు. మధ్యాహ్నం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

చిల్డ్రన్స్ పార్కు ప్రారంభం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని మదర్‌డెయిరీ పార్కులో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ పార్కును ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ స్థానిక కార్పొరేటర్ కే రవిచారితో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రూ. 35 లక్షల వ్యయంతో పిల్లలు ఆడుకునేందుకు క్రీడా సామగ్రి ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో యువజన నాయకులు ముఠా జైసింహ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వెంకటకృష్ణారావు, వి. నాగభూషణం, ఎంఐజీ–2 పార్కు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జి. రత్నాకర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ జి. శేషయ్య, పి. శంకర్, ప్రధాన కార్యదర్శి ఎస్వీ రమణారావు, కోశాధికారి ఎంజే జోసఫ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ పి.నాగేశ్వర్‌రావు, వాకర్స్ క్లబ్ అధ్యక్షులు పి.వి. నిరంజన్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు ఎస్ రమేశ్‌రెడ్డి, డివిజన్ ప్రెసిడెంట్ శంకర్ ముదిరాజ్, శైలజామోహన్, కూరగాయల శ్రీను, పద్మాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ఘనంగా వడ్డె ఓబన్న జయంతి వేడుకలు

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్‌లోని వడ్డెరబస్తీలో ఆ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో వడ్డెర కులస్తుల ఆరాధ్యదైవం వడ్డె ఓబన్న జయతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. అడిక్‌మెట్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సాయికృష్ణయాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ఓబన్న చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓబన్న ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని, వడ్డెర కులస్తుల డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, కిశోర్, దర్గా నర్సింగ్‌రావు, గౌరీ శంకర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



వడ్డె ఓబన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సాయికృష్ణయాదవ్ తదితరులు

పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలి



నూతన అధ్యక్షుడు నవీన్‌కుమార్‌ను సన్మానిస్తున్న కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్, శ్రేణులు

చిక్కడపల్లి: పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ అన్నారు. శనివారం తన కార్యాలయంలో డివిజన్ బీజేపీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన వి.నవీన్‌కుమార్ సన్మాన కార్యక్రమానికి శ్రేణులతో కలిసి ఆమె ముఖ్య అతిథిగా హాజరై సన్మానించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, ఎంపీ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్, సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, పూర్వ అధ్యక్షుడు రత్నసాయిచంద్‌కు నూతన అధ్యక్షుడు కృతజ్ఞతలు తెలిపారు. సీనియర్ నాయకులు శ్రీకాంత్, దామోదర్. పి.నర్సింగ్‌రావు, కృష్ణప్రసాద్, ఆకుల సురేందర్, సత్తిరెడ్డి, దోనేటి సత్యం, సాయికుమార్, శ్రీనివాస్, నీరజ్, విజయ లక్ష్మి, సంయుక్త రాణి తదితరులు పాల్గొన్నారు.